పైగామ్ ఎ హిదాయత్

సంపుటి: 4 సంచిక: 11 నవంబర్ 2016 వెల: 20/-

పర్యవేక్షకులు

మౌలానా ముహమ్మద్ అబ్దుల్ ఖవీ

సంపాదకులు

ముహమ్మద్ ఉమర్ ఫారూఖ్

మీ సలహాలు, సందేహాలు, ఫిర్యాదుల కొరకు సంప్రదించండి

Editor, Paigham e Hidayath,
17-1-391/2/79/A,
Khaja Bagh Colony,
Saidabad, Hyderabad - 500059.
Phone: 9030557865

బ్యాంక్ ఎకౌంట్ వివరాలు

Ac. no:035210011034204
MOHD ABDUL QAVI,
ANDHRA BANK,
MALAKPET BRANCH
IFSC Code: ANDB0000352

paighamehidayath.tk

విషయ సూచిక: ఫెహ్‌రిస్తే మజామీన్:

ఖుర్‌ఆన్ సందేశం:
సూరే హుజ్‌రాత్ 5

హదీస్ సందేశం:
మృదుభాష్యం–దుర్భాష 7

సీరతున్నబీ
అంతిమ ఘడియలు 10

వనితావని:
హజ్రత్ ఫాతిమా (ర.జి) 13

ప్రత్యేక వ్యాసాలు
సఫర్ ఇస్లాం దృష్టిలో 15

సందేహాలు - సమాధానాలు
సూట్ ధరించవచ్చా....? 20

దర్సే ఖుర్‌ఆన్:
సూరే హుజ్‌రాత్ 23

దర్సే హదీస్:
ఖుష్ కలామీ ఔర్ బద్‌జుబానీ 25

దర్సే సీరత్:
సఫరే ఆఖిరత్ 28

గోషె ఎ ఖవాతీన్:
హజ్రత్ ఫాతిమా (ర.జి) 31

ఖుసూసీ మజామీన్
సఫర్ ఇస్లామ్ కీ నజర్ మే 34
ఇస్లామ్ కే ఆదిలానా ఇజ్జెవాజీ నిజామ్ సే హుకూమతో సహాఫత్ కీ నాఇన్‌సాపీ 39

సువాలో జవాబ్
క్యా సూట్ పెహెన్ సక్తే హైఁ 49

చరితార్థులు:
షేఖ్ భికారీ సాహెబ్ 50

పత్రికలో రచయితలు వ్యక్తం చేసే అభిప్రాయాలు వారి స్వంతం. వారితో పత్రిక యాజమాన్యం, సంపాదకుడు ఏకీభవించవలసిన అవసరం లేదు.

ఖుర్‌ఆన్ సందేశం

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్

అనంత కరుణామయుడు అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

يَآ أَيُّهَا الَّذِيْنَ اٰمَنُوْا لَا يَسْخَرْ قَوْمٌ مِّنْ قَوْمٍ عَسٰٓى اَنْ يَّكُوْنُوْا خَيْرًا مِّنْهُمْ
وَلَا نِسَآءٌ مِّنْ نِّسَآءٍ عَسٰٓى اَنْ يَّكُنَّ خَيْرًا مِّنْهُنَّ ۚ وَلَا تَلْمِزُوْٓا اَنْفُسَكُمْ
وَلَا تَنَابَزُوْا بِالْاَلْقَابِ ۭ بِئْسَ الِاسْمُ الْفُسُوْقُ بَعْدَ الْاِيْمَانِ ۚ وَمَنْ لَّمْ
يَتُبْ فَاُولٰۗىِٕكَ هُمُ الظّٰلِمُوْنَ ⑪

యా అయ్యుహల్లజీన ఆమనూ లాయస్‌ఖర్ కౌముమ్ మిన్ కౌమిన్ అసా అయ్ యకూనూ ఖైరమ్ మిన్‌హుమ్ వ లా నిసాఉమ్ మిన్ నిసాయిన్ అసా అయ్ యకున్న ఖైరమ్ మిన్‌హున్న వలా తల్‌మిజూ అన్‌ఫుసకుమ్ వలా తనాబజూ బిల్ అల్‌కాబ్ బిఈసల్ ఇస్‌మిల్ ఫుసూకు బఅదల్ ఈమాన్ వ మల్లమ్ యతుబ్ ఫుఉలాయిక హుముజ్ జాలిమూన్

ఓ విశ్వాసులారా ! పురుషులు సాటి పురుషులను ఎగతాళి చేయకూడదు. బహుశా (అల్లాహ్ దృష్టిలో) వీరికంటే వారే ఉత్తములై ఉండవచ్చు.[1] అలాగే స్త్రీలు సాటి స్త్రీలను పరిహసించరాదు. ఎందుకంటే బహుశా (అల్లాహ్ దృష్టిలో) వీరికంటే వారే ఉత్తమురాలై ఉండవచ్చు. ఒకరినొకరు ఎత్తిపొడుచుకోకండి.[2] ఒండొకరికి చెడ్డపేర్లను ఆపాదించకండి.[3] విశ్వసించిన తరువాత తన సోదరుణ్ణి చెడ్డ పేరుతో అవమానించటం ఎంతపాపం ![4] మరెవరైతే పశ్చాత్తాపం చెందరో (ఈ ధోరణిని మానుకోరో) వారే దుర్మార్గులు.

1. వీరికంటే వారే ఉత్తములై ఉండవచ్చు.

ఎవరైనా తన్ను తాను గొప్పవాడిగా ఊహించుకుని, ఎదుటివాడిని అల్పుని కింద జమకట్టినప్పుడే ఎదుటివాడ్ని గేలి చేస్తాడు. కాని దైవసన్నిధిలో విశ్వాసం రీత్యా, సత్కర్మల దృష్ట్యా ఉత్తముడెవడో మనకెవరికీ తెలీదు. ఆ సంగతి దైవానికి మాత్రమే తెలుసు. కాబట్టి ఎవరూ ఇంకొకరిని చిన్నచూపు చూడకూడదు. ఈ నైతికపు రుగ్మత పురుషులకన్నా స్త్రీలలో అధికంగా ఉంటుందని అనబడుతోంది. అందుకే ప్రత్యేకంగా స్త్రీల పేరు కూడా పెట్టి అలా చేయరాదని తాకీదు చేయటం జరిగింది. ఇతరులను అధములుగా భావించటం అహంకారానికి ప్రతిరూపమని మహాప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ ప్రవచనం ద్వారా కూడా రూఢీ అవుతోంది. 'అల్ కిబ్రు బతరుల్ హఖ్ఖ్ వ గమ్తున్నాస్' (గర్వం అంటే సత్యాన్ని త్రోసిపుచ్చటం, ప్రజలను అల్పులుగా జమకట్టటం). (అబూదావూద్ – కితాబుల్లిబాస్). మరి చూడబోతే అహంకారాన్ని అల్లాహ్ ఎంతగానో అసహ్యించుకుంటాడు.

2. ఒకరినొకరు ఎత్తిపొడుచుకోకండి.

అంటే ఒకరికొకరిని ఎత్తి పొడవకండి. ఉదాహరణకు: ఓహో ! నువ్వు ఫలానా వ్యక్తి కొడుకువా, నీ తల్లి గురించి ఎవరికి తెలియదనీ, నీ పుట్టుపూర్వోత్తరాల గురించి నాకు తెలియదనుకున్నావా? అని వెటకారంగా అనటం. కొందరి మాటలు ఇంతకన్నా ఘోరంగా కూడా ఉంటాయి.

3. ఒండొకరికి చెడ్డపేర్లను ఆపాదించకండి.

అంటే ఇతరులను ఆటపట్టించే, అవమానించే ఉద్దేశంతో వారికి ఇష్టంలేని బిరుదులను, మారుపేర్లను వారికి అంటగట్టడం లేదా మంచి పేర్లు వక్రీకరించి పిలవటం అన్నమాట. ఈ చేష్టలన్నీ వారించబడ్డాయి.

4. చెడ్డ పేరుతో అవమానించటం ఎంతపాపం !

అంటే – ఉన్న పేరును చెడుగా వక్రీకరించటం, ఇస్లాం స్వీకరించి పశ్చాత్తాపం చెందిన తరువాత కూడా వారిని పాపాత్ముల సరసన నిలబెట్టి పేర్లు ప్రతిపాదించటం చాలా చెడ్డ విషయం. ఉదాహరణకు: ఒరేయ్ దైవతిరస్కారీ ! ఒరేయ్ త్రాగుబోతు ! మొదలగునవి. ఇస్మ్ అన్న పదం ఇక్కడ 'ప్రస్తావన' అన్న అర్థంలో వాడబడింది. అంటే విశ్వసించిన తరువాత కూడా వారి పేర్లను చెడుగా ప్రస్తావించడం పాపం అని దాని అర్థం. (ఫత్‌హుల్ ఖదీర్) అయితే ఎవరికయినా వారి స్వభావానికి తగ్గ మారుపేరు పడిపోయినప్పుడు, అలా పిలవటం వల్ల ఎవరికయినా ఇబ్బంది కలగకపోతే ఫరవాలేదు. (కుర్తుబీ)

అడుగడుగునా ఒక సంవత్సరపు ఉపవాసాలు, నమాజుల పుణ్యం

హజ్రత్ ఔస్ ఇబ్నె ఔస్ రజియల్లాహు అన్‌హు గారి ఉల్లేఖనం ప్రకారం దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు ఇలా సెలవిచ్చారు: ఏ వ్యక్తి అయితే జుమా రోజు శుభ్రంగా గుసుల్ చేస్తాడో, మసీదుకు త్వరగా వెళతాడో, స్వాలీ పై కాకుండా కాలినడకన మసీదుకు వస్తాడో, ఇమామ్‌కు దగ్గరగా కూర్చుంటాడో, నిశబ్దాన్ని పాటిస్తూ ఖుత్బాను శ్రద్ధగా వింటాడో, అనవసరపు పనులకు, మాటలకు దూరంగా ఉంటాడో అతడికి అడుగడుగునా (అనగా మసీదుకు వచ్చేటప్పుడు వేసిన ప్రతీ అడుగుకు బదులుగా) ఒక సంవత్సరపు ఉపవాసాలు మరియు నమాజుల పుణ్యం లభిస్తుంది.
(నసాయీ:1384; అబూదావూద్: 345; ఇబ్నె మాజహ్: 1087; తిర్మిజీ: 496)



మృదుభాష్యం-దుర్భాష

హదీసు సందేశం

మానవుడు తన నిత్య జీవితంలో తనలాంటి వారెందరితోనో కలుస్తూ ఉంటాడు. ఈ క్రమంలో ఒకరి నుండి ఒకరు గ్రహించే ప్రభావంలో సంభాషణ అతి ముఖ్యమైనది. తియ్యని సంభాషణ, కటువైన సంభాషణ, మృదుభాషణ, కఠిన పదజాల ప్రయోగం ఏదైనా కావచ్చు. అందుకే దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ తన అనుచరగణానికి, నగుమోముతో తియ్యగా మాట్లాడాలని ఉద్బోధించారు. చిటపటలాడుతూ కఠినంగా, కరకుగా మాట్లాడకూడదని గట్టిగా వారించారు. చివరికి చెడుమాటకు ప్రతిగానైనా సరే, చెడు మాటతో సమాధానం పలకడాన్ని కూడా ఆయన ఎంతమాత్రం ఇష్టపడేవారు కాదు. ఈ విషయాలకు సంబంధించిన కొన్ని హదీసులు క్రింద పేర్కొంటున్నాము.

★ హజ్రత్ ఆయిషా సిద్దీఖా రజియల్లాహు అన్‌హా ఇలా ఉల్లేఖించారు: "కొంత మంది యూదులు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారి సన్నిధిలో హాజరై, (చాలా పొగరుగా, తలబిరుసుతనంతో అస్సలాము అలైకుమ్ కు బదులుగా) 'అస్సాము అలైకుం అన్నారు. (అంటే ఇదొక తిట్టు, నీకు చావు మూడుగాక అని బీనర్థం). అప్పుడు హజ్రత్ ఆయిషా రజియల్లాహు అన్‌హా "మీకే మూడుగాక, మీపై అల్లాహ్ శాపం, ఆగ్రహం అవతరించుగాక!" అన్నారు.

ఇది విని దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు, "ఆయిషా ! (అంత కఠినంగా మాట్లాడకు) నోటిని అదుపులో ఉంచుకో. మెతక వైఖరిని అవలంభించు. కారుణ్యం, దుర్భాషనుండి నిన్ను నువ్వు రక్షించుకో" అని సెలవిచ్చారు.

(బుఖారీ)

సందేశం:

చూడండి దైవ ప్రవక్త మహనీయులు తన పట్ల అంత అమర్యాదగా మాట్లాడిన వారికి వ్యతిరేకంగా కూడా కాస్తంత కఠినంగా మాట్లాడినా హజ్రత్ ఆయిషా రజియల్లాహు అన్‌హా ను వారించారు. మెతక వైఖరిని, మృదుభాష్యాన్ని అవలంభించమని ఉపదేశించారు.

★ హజ్రత్ అబ్దుల్లాహ్ ఇబ్నె మస్‌ఊద్ రజియల్లాహు అన్‌హు గారి ఉల్లేఖనం ప్రకారం దైవ ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ ఇలా ఉపదేశించారు:

"విశ్వాసి అయిన దాసుడు నోటితో దాడికి దిగడు. శాపాలు పెట్టేవాడూ అయి ఉండడు. దుర్భాషలాడేవాడు, అశ్లీలం పలికేవాడు కాడు".

(తిర్మిజీ)

సందేశం:

నోరు విప్పితే దుర్భాషలాడడం, అశ్లీలం పలకడం, శాపనార్థాలు పెట్టడం అనేవి దైవ

విశ్వాసికి శోభించని లక్షణాలు. ఇలాంటి చేష్టలు అతని స్థాయిని దిగజార్చుతాయి. కితాబుల్ ఈమాన్ లో విభేదాలు తలెత్తినప్పుడు బూతులు తిట్టడం కపటగుణంగా చెప్పబడింది.

★ హజ్రత్ ఆయిషా సిద్దీఖా రజియల్లాహు అన్హా ఇలా ఉల్లేఖించారు:

"ఒక వ్యక్తి దైవ ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వారిని కలుసుకోవడానికి అనుమతి కోరాడు. అప్పుడు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారు (మమ్మల్ని ఉద్దేశిస్తూ) "ఇతను చాలా చెడ్డవాడు" అని చెబుతూనే లోపలికి వచ్చే అనుమతి ఇవ్వండి అని అన్నారు.

(బుఖారీ; ముస్లిం; అబూదావూద్)

అతడు వచ్చిన తరువాత దైవప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు అతనితో ఎంతో మృదువుగా మాట్లాడారు. (అతను వెళ్ళిన తరువాత) హజ్రత్ ఆయిషా రజియల్లాహు అన్హా వారు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారితో ఇలా విన్నవించుకున్నారు:

"దైవప్రవక్తా ! మీరా వ్యక్తితో ఎంతో చక్కగా, మృదువుగా మాట్లాడారు. ముందేమో అతణ్ని గురించి వేరుగా చెప్పారు (అతడు తన తెగలో చాలా చెడ్డవాడని)

అప్పుడు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు "ప్రళయదినం నాడు హేయాపరంగా అల్లాహ్ దగ్గర అత్యంత చెడ్డవాడు ఎవరంటే, ఎవరి నోటి దురుసుతనం, కారణ్య సంభాషణ కారణంగా ప్రజలు అతనికి దూరంగా ఉంటారో ఆ వ్యక్తే. (ప్రజలు అతణ్ని కలుసుకోవడానికి, మాట్లాడడానికి ముందుకు రారు) అని సెలవిచ్చారు.

సారాంశం:

అంటే ఒకవేళ అవతలివాడు దుష్టుడు, దుర్మార్గుడు అయినప్పటికి, అతనితో మృదువుగా, హుందాగా, మంచిగా మాట్లాడాలన్నది దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారి ప్రవచన సారాంశం. అలాకాక కఠిన వైఖరి అవలంభించినట్లయితే ప్రజలెవరూ అతణ్ణి కలుసుకోవడానికి ముందుకు రారు. ఈ కారణంగా అతడు అల్లాహ్ దృష్టిలో చెడ్డవాడిగా పరిగణించ బడతాడు. ప్రళయదినం నాడు అతని పరిస్థితి చాలా దుర్భరమైపోతుంది.

ఈ హదీసు గురించి మరికొన్ని విషయాలు కూడా తెలుసుకోవాలి:

1. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు ఆ వ్యక్తి తన వద్దకు రాకముందే అతను మంచివాడు కాదని తన వారికి చెప్పారు. ఇలా ఎందుకు చెప్పి ఉంటారు? బహుశా వీరు ఆ దుందుడుకు స్వభావి ముందు జాగ్రత్తగా మసలుకుంటారని, ఆచితూచి మాట్లాడాలనే ఉద్దేశం కావచ్చు. అతడు చెడ్డవాడని తెలియక, అతని ముందు మాట్లాడకూడని మాట ఏమైనా మాట్లాడితే వ్యవహారం బెడిసికొట్టవచ్చు. అందుకే దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు అతణ్ని గురించి ముందే చెప్పి ఉంటారు.

అంతే కాకుండా ఒక వ్యూహం ప్రకారం ఒకరి చెడు గురించి ఇతరులను జాగృత పరచడం చాడీల కిందికి కూడా రాదు. ఒక హదీసులో ఈ విషయమై ఇలా ఆదేశించబడింది:

"దుష్టులు, దుర్మార్గుల దౌష్ట్యాన్ని గురించి ప్రజలకు చెప్పండి. ఎందుకంటే ఆ దైవదాసులు వారి దౌష్ట్యాల నుండి సురక్షితంగా ఉండగలుగుతారు". (కంజుల్ ఉమ్మాల్)

2. ఈ హదీసు ద్వారా తెలిసిన మరో విషయం ఏమిటంటే, ఒక మనిషి చాలా చెడ్డవాడని, పొగరుబోతని తెలిసినప్పటికీ, అతనితో మృదువైఖరి అవలంభించే సంభాషించాలి. అంతేకాదు ఇదే

విషయానికి సంబంధించి బుఖారీ హదీసులోని ఒక ఉల్లేఖనంలో పదాల భావం ప్రకారం: "దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ ఆ వ్యక్తిని ఎంతో సంతోషంగా, చిరునవ్వుతో కలుసుకొని సంభాషించారు".

అంటే, ఎవరి చెడును గురించైనా మనకు ముందే తెలిసిపోతే, ఇక వారు మంచివారు కాదు కాబట్టి వారిని కలుసుకోవడం, సంభాషించడం మంచిది కాదు, వారిని దూరంగానే ఉంచాలి అని కొంతమంది భావిస్తారు. కాని ఈ హదీసు వెలుగులో ఈ అభిప్రాయం సరైంది కాదు, సమంజసమూ కాదు.

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారి ప్రసిద్ధ సహచరులు అబూదర్దా రజియల్లాహు అన్హు ద్వారా స్వయంగా ఇమాం బుఖారీ రహ్మతుల్లాహి అలైహ్ గారు ఉల్లేఖించారు:

"ఎవరి కర్మలు, ఆచరణల రిత్యా, మా హృదయాలు వారిని శపిస్తుంటాయో, అలాంటి వాళ్లతో కూడా మేము నవ్వుతూ కలిసి మాట్లాడేవాళ్ళం".

అయితే కొన్ని పరిస్థితుల్లో వివేకాన్ని దృష్టిలో ఉంచుకొని కఠిన వైఖరే అవలంబించడం తప్పనిసరైనప్పుడు వ్యూహం ప్రకారం కఠిన వైఖరి అవలంబించడం కూడా సమంజసమే.

3. ఈ హదీసులోని అబూదావూద్ మరో ఉల్లేఖనంలో హజ్రత్ ఆయిషా రజియల్లాహు అన్హా దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ ను "మీరు స్వయంగా ఆ మనిషి చెడ్డవాడని చెప్పారు. మళ్ళీ మీరే అతన్ని చిరునవ్వుతో కలుసుకొని, ఎంతో మృదువైఖరితో సంభాషించారు. ఇదేమిటి? అని ప్రశ్నించారు.

అప్పుడు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు ఇలా సెలవిచ్చారు:

"ఆయిషా ! అల్లాహ్ అసభ్యంగా, అమర్యాదగా మాట్లాడేవాణ్ని ప్రేమించడు" అన్నారు. అంటే, అసభ్యంగా మాట్లాడే అలవాటు దైవప్రేమకు, ఆయన ప్రసన్నతకు దూరం చేస్తుంది. మరి నేను అలాంటి చర్యకు ఎలా పాల్పడగలను? అని అర్థం.

★ **మంచిమాట, ఒక తియ్యని పలుకు కూడా 'సద్ఖా' తో సమానమని" దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు సెలవిచ్చినట్లు హజ్రత్ అబూ హురైరహ్ రజియల్లాహు అన్హు వారు ఉల్లేఖించారు.**

(బుఖారీ)

సంగ్రహణ:

ఇదొక సుదీర్ఘమైన హదీసులోని చిన్న భాగం. ఒకచోట ఇమాం బుఖారీ రహ్మతుల్లాహి అలైహ్ దీన్ని పూర్తిగా ఉల్లేఖించారు. మరొక చోట సందర్భానుసారం కొద్ది భాగాన్నే ఉటంకించారు. ఒక మనిషితో ఒక మంచి విషయం మధురంగా మాట్లాడితే అతని హృదయం ఆనందంతో పొంగిపోతుంది. ఒక దైవదాసుడి మనసును సంతోషపరచడం నిజంగానే గొప్ప సత్కార్యం.

మీ సంవత్సరపు చందా మా బ్యాంక్ అకౌంట్‌లో జమచేయగలరు...
మా

బ్యాంక్ ఎకౌంట్ వివరాలు

Ac. no:035210011034204
MOHD ABDUL QAVI,
ANDHRA BANK,
MALAKPET BRANCH
IFSC Code: ANDB0000352

అంతిమ ఘడియలు

సీరతున్ నబీ

చివరి సారిగా

ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు గురువారం నాడు మగ్‌రిబ్ నమాజు చివరి సారిగా చదివించారు. నమాజు చదివించి ఇంటికి వెళ్ళారు. ఇషా నమాజు కూడా మసీదుకు వచ్చి చదివించాలని అనుకున్నారు. కాని రాలేకపోయారు.

హజ్రత్ అబూ బకర్ సిద్దీఖ్ రజియల్లాహు అన్‌హూ ను నమాజు చదివించమని ఆజ్ఞాపించారు. వారి ఆజ్ఞ ప్రకారం హజ్రత్ అబూ బకర్ సిద్దీఖ్ రజియల్లాహు అన్‌హు గారు నమాజు చదివించారు. ఇలా చేసి హజ్రత్ అబూ బకర్ సిద్దీఖ్ రజియల్లాహు అన్‌హు గారిని తన ఖలీఫా (వారసుడి)గా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారే తమ జీవితంలో ప్రకటించారు. శనివారం లేదా ఆదివారం, ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు నలభై బానిసలను విడుదల చేశారు. అలాగే ఇంట్లో ఉన్న ఏడు దీనార్లను కూడా దానం చేయించేశారు.

ఆయన వద్ద ఉన్న ఆయుధాలను తన అనుచరులకు ఇచ్చేశారు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారి కవచం ఆ సమయంలో ఒక యూదుని వద్ద తాకట్టు పెట్టి ఉంది. ఆ రోజు ఇంట్లో పరిస్థితి ఏమిటంటే దీపం వెలిగించడానికి కూడా నూనె లేకపోతే హజ్రత్ ఆయిషా రజియల్లాహు అన్‌హా గారు ప్రక్కింటి వారి నుండి అరువు తెచ్చారు.

సోమవారం నాడు మసీదులో ఫజర్ నమాజు జరుగుతుండగా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు తమ గది యొక్క పరదాను ప్రక్కకు జరిపించి చూశారు. మసీదులో అందరూ కలిసి అల్లాహ్‌ను ప్రార్థించడం చూసి చాలా సంతోషించారు. ఆ ఆనందంతో ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారి ముఖము వెలిగిపోసాగింది మరియు పెదవులపై చిరునవ్వు వికసించింది.

హజ్రత్ ఫాతిమా రజియల్లాహు అన్‌హా కు శుభవార్త:

కొద్ది సేపటికి హజ్రత్ ఫాతిమా రజియల్లాహు అన్‌హా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారిని చూడటానికి వచ్చారు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు ఆమెను దెగ్గరకు పిలిచి వారి ఆఖరి ఘడియల గురించి చెప్పారు. అది విని ఆవిడగారు ఏడవ సాగారు. మళ్ళీ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు పిలిచి, "ఏడవకు, నన్ను అందరికంటే ముందు నువ్వే వచ్చి కలుస్తావు" అని చెప్పారు. ఇది విని ఆవిడ ఆనందంతో నవ్వసాగారు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు పడుతున్న వేదనను చూసి వారు సహించలేకపోయారు. దానికి ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు "బాధపడకు, ఈ రోజు

తరువాత మీ నాన్నకు ఇంక ఎలాంటి బాధ ఉండదు" అని అన్నారు.

తరువాత తన మనమళ్ళైన హసన్ మరియు హుస్సేన్ రజియల్లాహు అన్హుమా లను పిలిచి మాట్లాడారు. హజ్రత్ అలీ రజియల్లాహు అన్హు ను పిలిచి కొన్ని సలహాలిచ్చారు. తరువాత ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు వారి భార్యలను పిలిచి మాట్లాడారు. చివరకు అందరినీ ఉద్దేశించి, "నమాజు వేళకు చదవండి, మరియు తమపై ఆధారపడి ఉన్న వారి హక్కుల గురించి అల్లాహ్ తో భయపడండి" అని ఉపదేశించారు.

చివరి ఘడియలు

ఆ తరువాత ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు తుది శ్వాసలు తీసుకోసాగారు. ఆ సమయంలో ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు తమ తలని హజ్రత్ ఆయిషా రజియల్లాహు అన్హా గారి ఒళ్ళో పెట్టి ఉన్నారు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారి పక్కన ఒక చెంబులో నీళ్ళు పెట్టి ఉన్నాయి. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు తమ చేతిని నీటిలో ముంచి తరువాత ముఖం తుడుచుకోసాగారు. మరియు ఇలా అన సాగారు:

లా ఇలాహ ఇల్లల్లాహ్ ఇన్న లిల్ మౌతి సకరాత్

అల్లాహ్ తప్ప పూజించడానికి అర్హుడు ఎవరూ లేరు. నిజమే చావు చాలా బాధతో కూడినది.

హజ్రత్ ఆయిషా రజియల్లాహు అన్హా గారి అన్న హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ అబూ బకర్ రజియల్లాహు అన్హుమ్ ఇంటికి వస్తే వారి చేతిలోని మిస్వాక్ వైపు చూశారు. హజ్రత్ ఆయిషా రజియల్లాహు అన్హా ఒక మిస్వాక్‌ను నమిలి మెత్తగా చేసి ఇచ్చారు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు దానితో నోరు శుభ్రం చేసుకుని రెండు చేతులు ఎత్తి ఇలా ప్రార్థించారు:

అల్లాహుమ్మ అర్ రఫీఖల్ ఆలా

అల్లాహ్ దాసులను అల్లాహ్ మార్గమున నడిపించడానికి 23 సంవత్సరాల నిరంతర కృషి చేసిన అంతిమ దైవ ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారి ఆఖరి పలుకులు ఇవే.

అది హిజ్రీ శఖం 11వ సంవత్సరం, బుధవారం రబీఉల్ అవ్వల్ మాసపు 12 వ తేది, చాష్త్ నమాజు సమయం.

ఇన్నాలిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజిఊన్

వారి ఆగమనంతో పరిస్థితి:

క్రొద్ది సేపట్లో ఈ వార్త చుట్టు ప్రక్కల వ్యాపించిపోయింది. ప్రవక్త గారిని తమ ప్రాణాల కంటే ఎక్కువగా ప్రేమించే వారి అనుచరులను ఈ వార్త కుదిపివేసింది. ఒక్కొక్కరు ఒక్కో రకంగా స్పందించసాగారు. ఒకరు ఏమీ పాలుపోక అడవుల వైపుకు పరుగుతీస్తే మరొకరు ఏమీ మాట్లాడక అలాగే నిలుచుండిపోయారు. హజ్రత్ ఉమర్ రజియల్లాహు అన్హు గారైతే ఇది వాస్తవం కాదు, ప్రవక్త గారు బ్రతికే ఉన్నారు, వారు చనిపోయారని ఎవరైనా అంటే అతడి అంతు చూస్తాను అంటూ కత్తిపట్టుకొచ్చారు. హజ్రత్ ఉస్మాన్ రజియల్లాహు అన్హు గారు తమకుతామే కూర్చుండిపోయారు. ఇక ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారి సతీమణుల విషయం చెపనక్కరలేదు. హజ్రత్ ఫాతిమా రజియల్లాహు అన్హా వారైతే తమ గదిలో ఒక మూలన కూర్చుండిపోయారు.

ప్రవక్త గారి ఆరోగ్యం కుదుటపడిందని అనుకుని ప్రవక్త గారి అనుమతితో ఇంటికి వెళ్ళిన హజ్రత్ అబూ బకర్ సిద్దీఖ్ రజియల్లాహు అన్హు గారికి ఈ వార్త తెలియగానే తల దించుకుని కన్నీరు కారుస్తూ తమ కూతురైన హజ్రత్ ఆయిషా రజియల్లాహు అన్హా ఇంటికి వచ్చారు. లోపల ప్రవేశించి ప్రవక్త గారి పై కప్పి ఉన్న గుడ్డను తీసి

దివ్య ఖుర్ఆన్ వచనము **"ఇన్నక మయ్యితున్ వ ఇన్నహుమ్ మయ్యితూన్"** పఠించారు.

అక్కడి నుండి మసీదుకు వచ్చి తీవ్ర సంతాపములో కూరుకుపోయి ఉన్న సహాబా రజియల్లాహు అన్హుమ్‌లను చూసి వారి దివ్య ఖుర్ఆన్ వచనము "వ మా ముహమ్మదున్ ఇల్లా రసూల్ అఫిఇమ్ మాత అవ్ కుతిల ఇన్‌కలబ్‌తుమ్ అలా ఆకాబికుమ్ వ మై యన్‌కలిబ్ అలా అకిబైహి ఫలై యజుర్రుల్లాహ షైఆ" (ముహమ్మద్ కేవలం ఒక సందేశహరుడు మాత్రమే. అతను గనక చనిపోతే లేదా చంపబడితే మీరు వెనకంజ వేస్తారా? (గుర్తుంచుకోండి !) వెనుకంజ వేసే వారు అల్లాహ్‌కు రవ్వంత నష్టం కూడా కలిగించలేరు.) పఠించి వారి మనసులను కుదిపివేశారు. ఇంకా ఇలా అన్నారు "మీరు ముహమ్మద్‌ను కొలిచే వారైతే తెలుసుకోండి ముహమ్మద్ చనిపోయాడు, మీరు ముహమ్మద్‌ను పంపిన దైవాన్ని కొలిచేవారైతే తెసుకుకోండి ఆయన సజీవుడు, నిత్యుడు, అనంతుడు".

హజ్రత్ అబూ బకర్ సిద్దీఖ్ రజియల్లాహు అన్హు గారి ఈ సూటి మాటలు సహాబా రజియల్లాహు అన్హుమ్‌ల కళ్ళు తెరిపించాయి. బాధలో కూరుకుపోయి ఏమి చేస్తున్నారో, ఏమి మాట్లాడుతున్నారో తెలియని పరిస్థితిలో ఉన్న వారు అంతా ఒక్కసారిగా స్పృహలోకి వచ్చారు. మనసులో బాధను దిగమింగుతూ ఇక జరగాల్సిన పనులవైపు దృష్టి మళ్ళించారు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారి అంత్యక్రియలకు ఏర్పాట్లు మొదలెట్టారు.

హజ్రత్ అబూ బకర్ సిద్దీఖ్ రజియల్లాహు అన్హు గారి పర్యవేక్షణలో హజ్రత్ అలీ రజియల్లాహు అన్హు వారు గుసుల్ చేయించారు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారి పినతండ్రి అయిన) హజ్రత్ అబ్బాస్ రజియల్లాహు అన్హు గారి ఇద్దరు కుమారులు హజ్రత్ ఫజ్ల్ మరియు హజ్రత్ ఖస్మ్ రజియల్లాహు అన్హుమ్‌లు వారికి కావలసినవన్నీ అందిస్తూ ఉన్నారు.

ఆ తరువాత హజ్రత్ ఆయిషా సిద్దీఖా రజియల్లాహు అన్హా గారి గదిలో త్రవ్విన సమాధి అంచున జనాజాను పెట్టి హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్ రజియల్లాహు అన్హు గారి ఆజ్ఞ మేరకు అందరూ బయిటికి వెళ్ళిపోయారు. ముందుగా దైవ దూతలు జనాజా నమాజు చేశాయి. ఆ తరువాత సహాబా రజియల్లాహు అన్హుమ్ వరుసగా లోపలికి వెళ్ళి అందరూ వేరు వేరుగా వారి జనాజా నమాజు చదివి బయటికి వచ్చారు.

అందరూ విడివిడిగా జనాజా నమాజు చేసిన తరువాత హజ్రత్ అలీ, హజ్రత్ ఫజ్ల్ బిన్ అబ్బాస్, హజ్రత్ ఉసామా బిన్ జైద్, హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ రజియల్లాహు అన్హుమ్‌లు వారి పవిత్ర దేహాన్ని సమాధి గావించి అల్లాహ్‌కు అప్పగించారు. అక్కడ ఉన్నవారు తమ చేతులతో సమాధిపై మట్టి పోసే భాగ్యాన్ని పొందారు. సమాధిపై మట్టిని ఒంటె వీపు వలే కాస్త ఎత్తుగా పోసి దానిపై నీటిని జల్లారు.

నఖ్లీ ఫిదాఉ లిఖబ్‌రిన్ అన్‌త సాకినుహు
ఫీహిల్ అఫాఫ్ వ ఫీహిల్ జూదు వల్ కరము

మీ సలహాలు, సందేహాలు,
ఫిర్యాదుల కొరకు సంప్రదించండి

Editor, Paigham e Hidayath,
17-1-391/2/79/A,
Khaja Bagh Colony,
Saidabad, Hyderabad - 500059.
Phone: 9030557865



ఫాతిమా

బిన్తె రసూలుల్లాహ (స)

వనితావని

వివాహం తరువాత దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ అలీ రజియల్లాహు అన్హు తో వలీమా విందు ఉండాలన్నారు. మహర్ ఇచ్చిన తరువాత మిగిలిన నగదుతోనే వలీమా విందు ఏర్పాటు చేశారు. విందులో పన్నీరు ఖర్జూరాలు, జొన్నరొట్టె, మాంసము పెట్టారు. హజ్రత్ అస్మా రజియల్లాహు అన్హా గారి ఉల్లేఖనం ప్రకారం 'అది ఆ రోజుల్లో అత్యున్నత విందుగా భావించబడేది'.

ఫాతిమా నూతన గృహానికి వెళ్ళిన తరువాత దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ ఆమె వద్దకు వెళ్ళారు. గడపమీద నిలబడి అనుమతి కోరుతూ లోపల ప్రవేశించారు. ఒక గిన్నెలో నీరు తెప్పించారు. తన స్వహస్తాలతో హజ్రత్ అలీ రజియల్లాహు అన్హు గారి హృదయముపై నీరు చల్లారు. తరువాత ఫాతిమాను పిలిచారు. సిగ్గు, బిడియాలతో సంకోచిస్తూ తండ్రి వద్దకు వచ్చారు. ప్రవక్త వారు ఆమెపై కూడా నీరు చల్లారు.

ఫాతిమా, నేను నీ వివాహం నా కుటుంబీకుల్లో ఉన్నత వ్యక్తితో చేశాను అని అన్నారు.

ఫాతిమా నివాసం దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారి నివాసానికి కొంత దూరంలో వుండేది. దీంతో ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారికి రాకపోకలకు ఇబ్బంది కలిగేది. దైవ ప్రవక్త ఫాతిమా రజియల్లాహు అన్హా తో ఇలా అన్నారు "చిట్టి తల్లీ ! నేను తరచూ నిన్ను చూడటానికి రావల్సి వస్తుంది. నేను నిన్ను నా వద్దకు రప్పించు కోవాలనుకుంటున్నాను".

దానికి ఫాతిమా "మీ పొరుగున హారిసా బిన్ నోమాన్ రజియల్లాహు అన్హు వారి గృహాలు చాలా ఉన్నాయి. మీరు వారితో చెప్పండి ఏదో ఒక ఇల్లు ఖాళీ చేసి ఇస్తారు" అన్నారు.

హారిసా బిన్ నౌమాన్ రజియల్లాహు అన్హు ఓ ధనిక అన్సారీ సహాబీ. వారికి చాలా గృహాలున్నాయి. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు మదీనాకు వచ్చిన తరువాత అవన్నీ ఒక దాని తరువాత మరొకటి దైవప్రవక్తకు సమర్పించారు. ఫాతిమా హారిసా ఇంటి కొరకు విన్నపించుకోగా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు ఫాతిమా తో "అమ్మా ! హారిసాను అడగటానికి నాకు సిగ్గేస్తుంది, ఎందుకంటే హారిసా ఇప్పటికే ఎన్నో గృహాలు దైవం, దైవ ప్రవక్త ప్రసన్నతల కోసం దైవ మార్గంలో ఇచ్చేశారు" అని అన్నారు. దానితో ఫాతిమా మిన్నకుండిపోయారు.

ప్రవక్త తన కుమార్తెను తన దగ్గరకు రప్పించుకోవాలను కుంటున్నారని, కాని ఇల్లు దొరకటం లేదనే వార్త ఆనోటా ఈనోటా హారిసా రజియల్లాహు అన్హుకు చేరింది. వారు వెంటనే ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారి వద్దకు వచ్చి "ఓ దైవ ప్రవక్తా ! మీరు పిలుచుకోదలిస్తే

మీ పక్కనే ఉన్న ఇంటిని ఖాళీ చేస్తాను. ఫాతిమాను పిలవండి. దైవసాక్షిగా చెబుతున్నాను, ఏ వస్తువునైతే ప్రవక్త నా వద్ద నుండి తీసుకున్నారో అది నా కన్నా ప్రవక్త వద్ద వుండడమే నాకిష్టం" అన్నారు. తరువాత ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ అలీ, ఫాతిమా రజియల్లాహు అన్‌హుమాల నివాసాలను హారిసా బిన్ నౌమాన్ ఇంటికి మార్చారు.

హజ్రత్ ఫాతిమా రజియల్లాహు అన్‌హా వారు సంభాషణా మర్యాదలు అలవాట్లలో దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారి ఆదర్శాలు ఉట్టిపడేవి. ఆమె దైవభీటి, ధర్మపరాయణత, సహనస్థయిర్యాలు గల మహిళ. ఇంటి పనులంతా స్వయంగా ఆమే చక్కబెట్టేవారు. తిరుగలి తిప్పుతూ చేతుల్లో బొప్పలు వచ్చేవి. పొయ్యి రాజుతూ, ఇల్లు చిమ్ముతూ బట్టలు మాసిపోయేవి. ఇంటి పనులే కాకుండా దైవారాధన కూడా అధికంగా చేసేవారు. తండ్రి అరబ్ దేశ మహారాజు, విశ్వకారుణ్యమూర్తి కుమార్తె, అల్లుడు ఎన్నెన్నో రోజులు పస్తులు ఉండేవారు. ఓ సారి భార్యభర్తలు నాలుగు రోజులు పస్తులున్నారు. హజ్రత్ అలీ రజియల్లాహు అన్‌హు కూలీ చేసి ఒక దిర్హమ్ సంపాదించారు. పొద్దుపోయాక ఆ ఒక్క దిర్హంతో ఎక్కడి నుంచో జొన్నలు తెచ్చారు. హజ్రత్ ఫాతిమా రజియల్లాహు అన్‌హా ఎంతో సంతోషంగా భర్తను స్వాగతించారు. జొన్నలు తీసుకొని తిరుగలిలో వేసి పిండి కొట్టారు. రొట్టె చేసి హజ్రత్ అలీ రజియల్లాహు అన్‌హు ముందు పెట్టారు. ఆయన తిన్న తరువాత ఆమె కూర్చున్నారు. అప్పుడు ఫాతిమా ప్రపంచంలో అత్యున్నత మహిళ అన్న దైవప్రవక్త ఉపదేశం గుర్తుకొచ్చింది అన్నారు హజ్రత్ అలీ రజియల్లాహు అన్‌హు.

ఆ రోజుల్లో ఇస్లాం ధర్మం దినదిన ప్రవర్ధమానంగా విస్తరించ సాగింది. మదీనాలో యుద్ధ సంపద అధికంగా రావడం మొదలయింది. ఓ రోజు యుద్ధ సంపదలో కొంతమంది బానిసలొచ్చారని తెలిసింది. హజ్రత్ అలీ రజియల్లాహు అన్‌హు ఫాతిమాతో అన్నారు. ఫాతిమా ! తిరుగలి తిప్పుతూ తిప్పుతూ నీ చేతుల్లో బొబ్బలొచ్చాయి. పొయ్యి రాజేస్తూ ముఖవర్ఛస్సు మారిపోయింది. దైవప్రవక్త వద్దకు యుద్ధ సంపదలో చాలా మంది బానిసలొచ్చారు, వెళ్లి ఓ బానిస అడిగి తెచ్చుకో అన్నారు. హజ్రత్ ఫాతిమా రజియల్లాహు అన్‌హా దైవప్రవక్త వద్దకు వెళ్లారు. కాని సిగ్గు, బిడియంతో ఏమీ మాట్లాడ లేకపోయారు. కొద్దిసేపుండి తిరిగి వచ్చేశారు. హజ్రత్ అలీ రజియల్లాహు అన్‌హు తో నాకు బానిసను అడిగేంత ధైర్యం లేదు అన్నారు. తరువాత భార్యాభర్తలిద్దరూ దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ సన్నిధికి వెళ్ళి తమ బాధలను చెప్పుకున్నారు. బానిసనివ్వమని అడిగారు. అందుకు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు "నేను మీ సేవ కొరకు ఏ ఖైదీని ఇవ్వలేను. సుఫ్ఫా అనుచరుల అన్నపానియాల ఏర్పాట్లు చేయాలి. తమ ఇల్లు, వాకిలిని వదిలి దైవ ప్రసన్నత కొరకు పస్తులున్న వారిని ఎలా మరువను" అన్నారు. దంపతులిరువురూ మౌనంగా ఇంటికి తిరిగి వచ్చేశారు.

ఇబ్నెసాద్, హాఫిజ్ ఇబ్నె హజర్ కథనం ప్రకారం దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు రాత్రివేళ వారివద్దకెళ్ళి ఇలా అన్నారు: మీరు కోరుకున్న దానికన్నా ఉత్తమ మార్గం చెప్తాను. ప్రతి నమాజు తరువాత పదిసార్లు సుబ్‌హానల్లాహ్, అల్‌హందులిల్లాహ్, అల్లాహు అక్బర్ స్మరించండి. నిద్రకు ఉపక్రమించినప్పుడు సుబ్‌హానల్లాహ్, అల్‌హందులిల్లాహ్ 33 సార్లు స్మరించండి. ఈ ఆచరణ మీ కొరకు ఉత్తమ సేవకుడితో సమానం.

సఫర్ ఇస్లాం దృష్టిలో

ప్రత్యేక వ్యాసం

ఇస్లామీయ నెలలలో రెండవ నెల "సఫరుల్ ముజఫర్" మొదలౌతోంది. ఈ నెలను గూర్చి ఇస్లాంకు మునుపు నుండే ప్రజల్లో పలు రకాల మూఢనమ్మకాలు ఉండేవి. ప్రజలు ఈ నెలను చాలా అరిష్టమైనదిగా భావించేవారు. ఇందులో ఆకాశాల నుండి శని విరుచుకు పడుతుందని నమ్మేవారు. అందుకనే ఈ నెలలో ఎటువంటి శు భకార్యాలు చేసేవారు కాదు. ఆ అజ్ఞాన కాలంలో వారు అటువంటి మూఢనమ్మకాలు కలిగిఉ న్నారంటే అందులో ఆశ్చర్యమేమీ లేదు. కానీ ఇవాల్టి ఈ ఆధునిక యుగములో కూడా, కొందరు ఇటువంటి మూఢనమ్మకాలు కలిగి ఉన్నారంటే అది ఎంతో ఆశ్చర్యకరమైన విషయం. అందులో వారు ముస్లింలు కావడం దుఖించ దగిన విషయం. ఇవాళ కూడా కొందరు ముస్లింలు ఈ నెలను అరిష్టమైనదిగా, శనితో కూడినదిగా భావిస్తారు. వారి ప్రకారం ఈ నెలలో మొదలు పెట్టిన ఏ పనీ పూర్తి కాదు. పెళ్లి చేస్తే ఆ జంట సుఖంగా ఉండదు. వ్యాపారం మొదలు పెడితే అందులో కేవలం నష్టమే చూడాల్సి వస్తుంది..... మొదలగు...

గుర్తుంచుకోండి ! దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారు ఆనాడే ఇటువంటి మూఢ నమ్మకాల్ని కొట్టిపారేశారు. మనకు మంచి జరిగినా, చెడు జరిగినా అది అల్లాహ్ నిర్ణయం ప్రకారమే జరుగుతుందని, అందులో రోజులకు, నెలలకు, ఘడియలకు ఎటువంటి ప్రమేయము లేదని, ఏ కాలాన్నీ, ఏ మాసాన్నీ, ఏ రోజునీ, ఏ వస్తువునీ అరిష్టమైనదిగా భావించరాదని, అపశకునంగా తలచరాదని ముస్లింలకు బోధించారు. దీనికి భిన్నంగా దేన్నైనా అరిష్టమైనదిగా చూడడం ఇస్లాంలో చాలా పెద్ద నేరమని, అది షిర్క్ (అంటే షిర్క్ యొక్క వివిధ రూపాలలో ఒకటి) అని దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారు తెలిపారు.

అబూదావూద్ లోని ఓ ఉల్లేఖనం లో ఇలా ఉ ంది: దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారు మూడు సార్లు చాలా తాకీదుగా ఇలా చెప్పారు: "అత్ తియరతు షిర్కున్ అత్ తియరతు షిర్కున్ అత్ తియరతు షిర్కున్" (దేన్నైనా) అపశకునంగా చూడడం షిర్క్ (అల్లాహ్ కు సాటి కల్పించడం) (దేన్నైనా) అరిష్టమైనదిగా భావించడం షిర్క్, (దేన్నైనా) కలిసిరానిదని అనుకోవడం షిర్క్. (అబూదావూద్: 3910)

ముస్నదే అహ్మద్ కు చెందిన ఓ ఉల్లేఖనం ప్రకారం దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారు ఇలా అన్నారు: "దేన్నైనా అపశకునంగా భావించి ఏ వ్యక్తి అయితే తన పనిని నిలిపివేస్తాడో నిశ్చయంగా అతడు షిర్క్ చేశాడు." (ముస్నదే అహ్మద్: 2/220)

ఈ హదీసు ద్వారా అర్థమయ్యేది ఏమిటంటే సఫర్ నెల మొదలైందని (అదే కాదు ఇంకే నేలనైనా

సరే) అది అరిష్టమైనదని, కలిసిరానిదని భావించి ఎవరైనా పెళ్లి లేదా ఇంకేమైనా శుభకార్యాలను వాయిదా వేసుకుంటే అతడు నిశ్చయంగా ఘోరాతి ఘోర పాపమైన షిర్క్ కు పూనుకున్నట్లే.

ధార్మిక విద్వాంసుల మధ్య ఇక్కడ స్వల్ప విభేదము ఏర్పడింది. కొందరు హదీసులో పేర్కొనబడిన షిర్క్ అది షిర్కే అక్బర్ (చాలా ఘోరమైన షిర్క్, అంటే అల్లాహ్ ఉనికిలో, లేదా ఆయన శక్తి సామర్థ్యాలలో ఇతరులను సాటికల్పించడం) అని అంటే, మరికొందరు దాన్ని షిర్కే అస్గర్ (చిన్నపాటి షిర్క్) అని అభిప్రాయ పడ్డారు. షిర్కే అక్బర్ అనడానికి కారణమేమిటంటే అతడు కేవలం అల్లాహ్ కు మాత్రమే కాకుండా వేరే వాటిలోనూ (నెలలు, మాసాలు, వస్తువులలోనూ) లాభనష్టాలు చేకూర్చే శక్తి ఉందని భావించాడు. ఇలా భావించడం నిశ్చయంగా షిర్కే అక్బర్ అవుతుంది. ఏమైనప్పటికీ షిర్క్ అది అస్గర్ అయినా అక్బర్ ఐనా అది ఇస్లాం లో చాలా ఘోరమైన అపరాధం. అల్లాహ్ మనల్ని దీని నుండి కాపాడు గాక. ఆమీన్...

ముస్లిం అనబడే ప్రతి ఒక్కడు తన హృదయ ఫలకముపై ముద్రించుకో వలసిన విషయం ఏమిటంటే అల్లాహ్ తఆలా దివ్య ఖురాన్ లో ఇలా సెలవిస్తున్నారు:

"భూమి మీద గానీ, లేదా స్వయంగా మీ మీద గానీ విరుచుకు పడే ఏ ఆపదైనా సరే ! మేము దాన్ని సంభవింపజేసే ముందే అది (ఎప్పుడో) పుస్తకంలో వ్రాసివేయబడి ఉంటుంది." (సూరే హదీద్: 57: 22) అంటే మీ కొరకు అల్లాహ్ ఏది రాసిపెట్టాడో అదే సంభవిస్తుంది. రోజులు, ఘడియలు, మాసాలు, వాస్తులు, శకునాలు వీటిలో మీకు లాభనష్టాలు తెచ్చిపెట్టే శక్తి, ప్రభావం ఎంత మాత్రం లేదు. కాబట్టి సఫర్ నెలలో పెళ్లి చేస్తే, మొహర్రం నెల తొలి పదిరోజుల్లో భార్యా భర్తలు కలిస్తే, ముహర్రంలో అత్తారింట్లో ఉంటే, శనివారం పని ప్రారంభిస్తే, పొద్దున్నే ఒకడి ముఖం చూస్తే, పని మీద బయలుదేరేటప్పుడు ఎక్కడికని భార్య అడిగితే, తమ్ముడు అన్న కంటే ఎత్తైన చోట ఇల్లు కట్టుకుంటే, తమ్ముడి ఇంట్లో నీళ్ళు, అన్న ఇంటి మీదగా ప్రవహిస్తే, ఇల్లు వాస్తు ప్రకారం కట్టించకపోతే కీడు జరుగుతుంది అని ఏవైతే ప్రజలలో ఇవాళ మూఢనమ్మకాలు ఉన్నాయో అందులో రవ్వంత వాస్తవం కూడా లేదు. ఒక వేళ వాటిలో కాస్తైనా వాస్తవం ఉండి ఉంటే అమెరికా, రష్యా లాంటి పెద్ద పెద్ద దేశాలు ఇవాళ ప్రగతి పదంలో ఉండేవికావు. వారు వందల అంతస్తులు కడతారు కానీ ఏనాడూ వాస్తును చూడరు, పెళ్లిళ్లు చేస్తారు కానీ ముహూర్తాలు లాంటివి ఏవీ పట్టించుకోరు, దేశ విదేశాల్లో వ్యాపారాలు చేస్తారు కానీ రోజులు, నెలలు, నక్షత్రాలు చూసుకోరు. మరి వారెందుకు మనకంటే మంచి స్థాయిలో ఉన్నారు? ఆలోచించండి !!!

ఇదే వాస్తవాన్ని దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారు ఈ విధంగా తెలిపారు:

ఓ విశ్వాసుల్లారా ! తెలుసుకోండి: మీకు మంచి చేయాలని ప్రపంచం మొత్తం ఏకమైనా మీకు దేవుడు రాసిపెట్టిన దాని కంటే ఒక్క రవ్వంత ఎక్కువ కూడా మంచిని చేకూర్చలేరు. అలాగే వారంతా మీకు కీడు చేయాలని ఏకమైనా అల్లాహ్ రాసిపెట్టిన దాని కంటే కాస్త ఎక్కువ కూడా హాని కలిగించలేరు.

ఇప్పటి వరకు మీరు అల్లాహ్ మరియు వారి ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారి మాటలను చూశారు. మరి సఫర్ మాసాన్ని అరిష్టంగా భావించే వారి మాటలను కూడా చూద్దాం.

వారి వ్యాఖ్యానం: సఫర్ నెల అరిష్టమైనది అనడానికి మొదటి సాక్ష్యం:

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారు "ఎవరైతే సఫర్ నెల వెళ్లిపోయిందని నాకు శుభవార్త వినిపిస్తారో వారికి నేను స్వర్గపు శుభవార్తను వినిపిస్తాను" అని అన్నారు. దీన్ని బట్టి అది ఎంత అరిష్టమైన మాసమో, అది ముగిసిపోవాలని ప్రవక్త గారు ఎంత ఆతృతతో ఎదురు చూసేవారో మనకు అర్థమౌతుంది.

మాషాల్లాహ్ ! చాలా బాగుంది !! కానీ ఈ హదీసు ఏ గ్రంధంలో ఉందటా? బుఖారీ లోనా? ముస్లిం లోనా? ఈ విషయాన్ని ఏ సహాబీ ఉల్లేఖించారట? అబూ హురైరా ర.జి నా? అబూ సయీద్ ఖుద్రీ ర.జి నా? ప్రవక్త గారికి సఫర్ మాసము ముగిసిందని శుభవార్తను వినిపించి స్వర్గం కన్ఫార్మ్ చేసుకున్న సహాబా ఎంతమంది ఉన్నారంటా? వారి పేర్లు, వివరాలు ఏంటటా?

ప్రళయ దినం వరకు గడువిచ్చినా వీటికి సమాధానం లభించదు. ఎందుకంటే అసలు అలాంటి హదీసు ఉంటే కదా. ముల్లా అలీ ఖారీ రహ్మతుల్లాహి అలైహ్ గారు "అల్ మౌజూఆతుల్ కుబ్రా" లో ప్రజల నోటిలో తప్ప ఏ గ్రంధములోనూ కనబడని ఈ హదీసు అవాస్తవమని, కేవలం మానవ కల్పితమేనని నిర్ధారించారు. ఇమామ్ షౌకానీ రహ్మతుల్లాహి అలైహ్ "ఫవాయిదుల్ మజ్మూఅహ్" లో ఇమామ్ సన్ఆనీ మరియు అల్లామా ఇరాఖీ (వీరిద్దరూ ప్రముఖ హదీసు పండితులు) ఈ హదీసును "మౌజూ" అనగా కృత్రిమమైనది, స్వయంగా కల్పించుకున్నది అని ఘోషించినట్లు తెలిపారు. మరి ఈ మాటను ఎవరు అల్లారు? దీనివల్ల వారికి ప్రయోజనమేమిటి? వీటికి సమాధానం ఫతావా ఆలమ్‌గీర్ లో మనకు లభిస్తుంది. ఫతావా ఆలమ్‌గీర్ ప్రకారం ఆనాటి జోతిష్కులు సఫర్ మాసము మంచిది కాదని భావించేవారు. వారి మాట నిజమని నమ్మించడానికి వారు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారి పేరును వాడుకొని ఈ అబద్ధాన్ని సృష్టించి ప్రజల్లో వ్యాపింపజేశారు. బహుశా సఫర్ మాసము గురించి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారు సహీ హదీసుల్లో ఏమి తెలిపారో వారికి తెలియదు. ప్రవక్త గారు చాలా స్పష్టంగా ఇలా అన్నారు: "సఫర్ అరిష్టమైనదన్న భావన, ఉల్లూ (గుడ్లగూబ) వస్తే అపశెఖునము అన్న భావన అవాస్తవం" (బుఖారీ 5770)

రెండవ ఆధారం: ఈ నెలలోని మొదటి 13 రోజులు అలైహి వసల్లం గారు అనారోగ్యానికి గురికావడం:

వారి ప్రకారం ఈ నెల మొదటి 13 రోజులు చాలా అరిష్టమైనవి. ఇందులో ప్రవక్త గారు అనారోగ్యానికి గురయ్యారు. ఈ 13 రోజుల్లో ఆకాశం నుండి శని విరుచుకుపడుతుంది, అందుకే వీటిని "తేరా తేజీ" అంటారు. వీటిలో ఊడిపడే శని ప్రభావం నుండి బయటపడాలంటే 13వ తేదీ రాత్రి నిద్రపోయేటప్పుడు తల దగ్గర గుడ్లు, నిమ్మకాయలు పెట్టుకొని నిద్రపోవాలి. అప్పుడు ఆ శని ప్రభావం వాటిలోకి వెళ్లిపోతుంది. ఉదయాన్నే వాటిని పేదవారికి దానం చేసేస్తే సరిపోతుంది.

ఈ మాటలు విన్న వెంటనే ఒక సాధారణ వ్యక్తి నిజమా? చాలా థాంక్స్. బాగా ఉపయోగ పడే విషయాలు చెప్పారు అని అనవచ్చు. కానీ కొంచమైనా ధార్మిక పరిజ్ఞానం ఉన్నవాడు వీటిని వెంటనే తిరస్కరిస్తాడు. ఎందుకంటే ప్రవక్త గారు చనిపోవక ముందు 13 రోజులు అనారోగ్యానికి గురయ్యారు అన్న విషయం వాస్తవమే. కానీ ఆ

13 రోజులు సఫర్ నెల ప్రారంభంలో కాదే !! ప్రవక్త గారు 12 రబీయుల్ అవ్వల్ మధ్యాహ్నం (అంటే వారు పుట్టిన తేదీనే, వారు మదీనా కు వలస వెళ్ళిన తేదీనే) మరణించారు. దానికి ముందు 13 రోజులు, అంటే రబీయుల్ అవ్వల్ మొదటి రెండు వారాలు, సఫర్ నెల చివర్లో ఒక రెండు మూడు రోజులు అనారోగ్యంగా ఉన్నారు. సఫర్ మాసపు మొదటి 13 రోజులకు వారి అనారోగ్యానికి ఎటువంటి సంబంధమే లేదు. ఒక వేళ ఉందే అనుకుందాం. మీరు చెప్పినట్లే వారు ఆ 13 రోజులు అనారోగ్యానికి గురయ్యారనే అనుకుందాం. మరి ఇస్లాం ప్రకారం అనారోగ్యం అనేది శాపాం కాదే, అది దేవుని అనుగ్రహం మరియు ఆయన కరుణకు నిదర్శనం అని ఇస్లాం బోధిస్తుంది. ఎవరినైతే అల్లాహ్ అనుగ్రహ దృష్టితో చూస్తాడో, వారిని అనారోగ్యం మరియు ఇతర ఇబ్బందులకు గురిచేస్తాడని, తద్వారా వారి పాపాలను క్షమిస్తాడని, వారి పుణ్యాలను అధికం చేస్తాడని, స్వర్గంలో వారి స్థానాన్ని ఇంకా పెంచుతాడని, అందుకే వ్యాధిని నోటికొచ్చినన్ని మాటలు అనకూడదని స్వయంగా ప్రవక్త గారే బోధించారు. (చూడండి: బుఖారీ: 5645; 5641; 5647; ముస్లిం: 2571; 2572; 2575). మరి అలాంటప్పుడు వారు అనారోగ్యానికి గురైన రోజులు అరిష్టమైనవిగా ఒక ముస్లిం ఎలా భావించగలడు? ఇక గుడ్లూ, నిమ్మకాయల విషయానికొస్తే అది అటు ఖురాన్ లోనూ ఇటు హదీసు లోనూ ఎక్కడా కనిపించదు. అంతే కాదు, అది ఖురాన్ బోధించిన విషయాలకు విరుద్ధమైనదని కళ్ళు మూసుకొని చెప్పొచ్చు. ఎందుకంటే మీరు చెప్పినట్లే ఒకవేళ వాటిలో శని ప్రవేశిస్తే వాటిని పారేయమని ఇస్లాం ఆదేశిస్తుందే గానీ, వాటిని పేదలకు ఇవ్వమని ఆదేశించదు. అల్లాహ్ దివ్య ఖురాన్ లో ఈ విధంగా ఆదేశిస్తున్నాడు: ఓ విశ్వాసులారా! మీరు సంపాదించిన దాని నుండి మరియు మేము మీ కొరకు భూమినుండి ఉత్పత్తి చేసిన వాటినుండి **మేలైన వాటినే** దేవుని మార్గంలో (దానధర్మాల్లో) ఖర్చుపెట్టండి. ఏ వస్తువులనైతే మీరు కండ్లు మూసుకునే గానీ తీసుకోరో. **అలాంటి చెడ్డ వస్తువులను ఇతరులపై ఖర్చు చేయడానికి** ఉద్దేశించకండి. (సూరే బఖరా: 2: 267) మీకు ఫ్రీగా ఇచ్చినా మీరు తీసుకోడానికి ఇష్టపడనటువంటి వస్తువులని పేదలకు మీరు దానం చేసి పుణ్యాన్ని ఆశించకండి అని "మీకు అత్యంత ప్రీతికరమైన దానిని మీరు దేవుని మార్గంలో ఖర్చు పెట్టనంత వరకు మీరు పుణ్యాత్ములు కాలేరు" అని సూరే ఆలే ఇమ్రాన్: 3: 92 లో ఇంత స్పష్టంగా చెప్పాక కూడా ఇటువంటి గుడ్లూ, నిమ్మకాయలు, పాపం పేదవాళ్ళకు దానం చేయమని ఇస్లాం బోధించింది అంటే ఎవడు నమ్ముతాడు.

తలా తోక లేనటువంటి వీరి మాటలకు జవాబులు ఇస్తూ ఈ వ్యాసాన్ని మరింత పొదగించే కన్నా దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారి ఓ పవిత్ర హదీసుతో దీన్ని ముగించడం మంచిదనిపిస్తోంది. ఎందుకంటే తెలివిగలవాడికి సైగ చాలంటారు, మరి ఇంత క్లుప్తంగా రాసిన తరువాత ఇక సఫర్ గురించి ప్రజల మధ్య ప్రాచుర్యంలో ఉన్న విషయాలు అన్నీ అవాస్తవాలేనని తెలుసుకోవడం ఒక ముస్లింకు కష్టమేమీ కాదని భావిస్తున్నాను. అల్లాహ్ మనందరికీ ఇస్లాం ధర్మాన్ని సరిగ్గా అర్థం చేసుకొని దానిపై ప్రవక్త గారు చూపిన రీతిలో నడిచే భాగ్యాన్ని ప్రసాదించుగాక. ఆమీన్....

ఓ అమూల్యమైన హదీసు: ఒక సారి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారికి వారి ఉమ్మత్ (అనుచర సమాజాన్ని) చూపించి వారిలో 70,000

మందికి మాత్రం ఎటువంటి లెక్క చూడకుండానే స్వర్గంలోకి ప్రవేశము కల్పించబడుతుందని చెప్పడం జరిగింది. ఈ విషయాన్ని ప్రవక్త గారు తమ సహాబాకు చెప్పి వారు ఎవరో చెప్పకుండానే (బహుశా ఏదో పనిబడి) ఇంట్లోకి వెళ్ళిపోయారు. వారి అనుచరులు మాత్రం ఆ మహానుభావులు ఎవరు? అని ఒకరినొకరు ప్రశ్నించుకొని ఫలానా వారు అయి ఉంటారని వారే అంచనాలు వేసుకోవడం ఆరంభించారు. ఈ విషయం ప్రవక్త గారికి తెలియగా వారు మళ్ళీ బయటకొచ్చి ఇలా అన్నారు: హుముల్లజీన లా యాస్తరిక్కూన్ (వారు తాయత్తులు వగేరా కోరనివారు) వలా యతతయ్యరూన్ (వేటినీ అరిష్టం, అపశకునం అని భావించనివారు) వలా యక్తవూన్ (వాతలు పెట్టించుకోనివారు) (అంటే ఆ కాలంలో కొన్ని వ్యాధులకి వాతలు పెట్టి చికిత్స చేసేవారు. అలాంటి వాటికి దూరంగా ఉండేవారని అర్థం) వ అలా రబ్బిహిమ్ యతవక్కలూన్ (వారి ప్రభువు పై పూర్తి విశ్వాసం కలవారు). (బుఖారీ: 5705; 6472; ముస్లిం: 375; తిర్మిజీ: 2446)

గౌరవనీయులైన పాఠకులారా !

మీ వద్దకు క్రమం తప్పకుండా పైగామ్ ఎ హిదాయత్ మాసపత్రిక పంపబడుతోంది. 85 శాతం మంది బకాయిలు చెల్లించ వలసియున్నది. కాబట్టి వాటిని చెల్లించవలసిందిగా మనవి చేసుకుం టున్నాము. మీ మెంబర్‌షిప్ వివరాలు కవర్ పై అతికించిన మీ అడ్రస్ పై లైన్‌లో ఉంటాయి. మొదటి లైన్‌లో మీరు ఎప్పటి వరకు డబ్బులు చెల్లించారు, ఆ తరువాత మీ మెంబర్‌షిప్ నెంబర్, ఆ తరువాత మీ పూర్తి అడ్రస్ ఉంటుంది. దయచేసి మీరు గనక బకాయి చెల్లించాల్సి ఉంటే వెంటనే మా అడ్రస్‌కు మనిఆడర్ లేదా మా బ్యాంక్ అకౌంట్‌లో డిపాజిట్ చేయగలరు. అలాగే ఎం.వో ద్వారా చందా పంపే పాఠకులు తమ ఇంటి నెంబరు, పోస్టాఫీసు పిన్‌కోడ్ నెంబరు తదితర పూర్తి వివరాలు తమ చిరునామాలో తెలియపరచ వలెను. అలాగే మాకు చందా అందిన వెంటనే మీరిచ్చిన చిరునామాకు పత్రికను తప్పక పంపిస్తాము. అనుకోని కారణాల వల్ల మీకు పత్రిక అందనట్లయితే మాకు తప్పక తెలియజేయగలరు.

ఉండవల్లి చరిత్రకారుడు నశీర్ అహమ్మద్‌కు 'ప్రౌడ్' విశిష్ట సేవా అవార్డు.

తాడేపల్లి, నవంబర్ 6: గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఉండవల్లి గ్రామానికి చెందిన చరిత్రకారుడు, బహుగ్రంథ రచయిత, సయ్యద్ నశీర్ అహమ్మద్‌కు హైదరాబాద్‌కు చెందిన 'ప్రౌడ్' సంస్థ 'విశిష్ట సేవా అవార్డు'ను ప్రకటించింది. గత రెండు దశాబ్దాలుగా భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రను పరిశోధిస్తూ వెలుగులోకి రాని విశిష్ట సమాచారాన్ని వెలికి తీసి వందలాది వ్యాసాలు, పలు పరిశోధనాత్మక చరిత్ర గ్రంథాలను వెలువరించడం ద్వారా తెలుగు ప్రజలకు చారిత్రక సమాచారాన్ని అందజేస్తున్న నశీర్ అహమ్మద్ నిరంతర కృషికి గుర్తింపుగా ఈ అవార్డు అందించి గౌరవించనున్నట్లు 'ప్రౌడ్' (ప్రోగ్రెసివ్ ఆర్గనైజేషన్ ఫర్ అన్‌రీచ్డ్ అండ్ డిసేబుల్డ్, హైదరాబాద్) సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మేడంకి సుబ్బారావు తెలిపారు. ఈ నెల 19న హైదరాబాద్ లోని శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని ఎన్టీఆర్ ఆడిటోరియంలో జరుగు సంస్థ 12వ వార్షికోత్సవ సంబరాలలో నశీర్‌కు విశిష్ట సేవా అవార్డు అందజేస్తారు.

మోసం చేయవచ్చా?

సందేహాలు సమాధానాలు

1. మనము నిద్రపోయినప్పుడు మన ఆత్మలు అర్ష్ వద్దకు వెళతాయి, అక్కడ అల్లాహ్ కు సజ్దా చేయమని ఆదేశించబడుతుంది. అప్పుడు ఏ వ్యక్తి అయితే వజూ చేసి నిద్రపోయి ఉంటాడో అతడి ఆత్మ మాత్రమే సజ్దా చేయగలుగుతుంది అని బుఖారీ లో వ్రాయబడి ఉందంటూ ఒక మెసేజ్ ఈ మధ్య ఇంటర్నెట్ లో వచ్చింది. ఇది నిజమేనా?

జ: ఈ మెసేజ్ కరెక్టు కాదు. ఇందులో ప్రస్తావించబడిన ఉల్లేఖనము ప్రామాణికమైనది కాదు. అలాగే బుఖారీలో ఇది ప్రస్తావించబడిందన్న విషయము కూడ సరికాదు. ఈ మెసేజ్ పంపినవాడు పొరబడ్డాడు లేదా మోసం చేశాడు. ఎందుకంటే ఇమామ్ బుఖారీ రహ్మతుల్లాహి అలైహి ఈ ఉల్లేఖనాన్ని వ్రాసారు. కాని బుఖారీలో కాదు. "తారీఖుల్ కబీర్" అనే పుస్తకంలో. అది హదీసు పుస్తకం కాదు. హదీసులను ఉల్లేఖించే ఉల్లేఖన కర్తలకు సంబంధించిన పుస్తకం. అందులో వారు సిఖా (అనగా నమ్మదగిన ఉల్లేఖనకర్తలు) ఎవరు, హదీసుల పేరిట మోసం చేసే అబద్ధికులు ఎవరు, వారు ఉల్లేఖించిన తప్పుడు ఉల్లేఖనలు ఏమిటి అనే విషయాలు ప్రస్తావించారు. ఈ పుస్తకంలో (6/292) అలీ ఇబ్నె గాలిబ్ అల్ ఫహ్రీ అల్ ఖురషీ అనే వక్తి గురించి వ్రాస్తూ అతడు ఉల్లేఖించిన ఈ ఉల్లేఖనాన్ని ప్రస్తావించి ఇది సహీహ్ (నమ్మదగినది) కాదని వారు స్పష్టం చేశారు.

ఇది తెలిసి కూడా ప్రజలను మోసం చేయాలనే ఉద్దేశంతో లేదా తెలియక అక్కాడా ఇక్కడా విని దీన్ని ఎవరో ఇంటర్నెట్‌లో షేర్ చేసి ఉంటాడు.

2. మీ ఊళ్ళో బయాన్ చేసినప్పుడు దుఆ గురించి చాలా విషయాలు తెలిపారు. కాని యే యే సందర్భాలలో దుఆ ఆలకించబడుతుందో తర్వాత ఎప్పుడైనా చెబుతానని అన్నారు. అవేమిటో తెలుపగలరు.

జ: చాలా సందర్భాలలో దుఆ తప్పక ఆలకించబడుతుందని ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు తెలిపారు. వాటిలో కొన్ని ఇవి:

1. తహజ్జుద్ నమాజు వేళ (బుఖారీ: 1145)
2. ప్రతీ ఫరజ్ నమాజు తరువాత (తిర్మిజీ: 3499)
3. అజాన్ మరియు ఇఖామత్ మధ్య భాగంలో (తిర్మిజీ: 212; అబూదావూద్: 521)
4. అజాన్ ఇచ్చేటప్పుడు, ధర్మయుద్ధానికై వరుసలో నిలబడేటప్పుడు. (అబూదావూద్: 2540)
5. వర్షం పడేటప్పుడు. (అబూదావూద్; సహీహుల్ జామె: 3078)
6. జుమా రోజు ఓ ప్రత్యేకీయక ఘడియలో. (బుఖారీ: 935; ముస్లిం: 852)
7. జంజం నీరు త్రాగేటప్పుడు. (అహ్మద్; సహీహుల్ జామె: 5502)
8. సజ్దా లో ఉన్నప్పుడు. (ముస్లిం: 482)

9. ఉపవాస స్థితిలో, ప్రయాణములో, తండ్రి తన సంతానము కొరకు చేసే దుఆ. (బైహఖీ; సహీహుల్ జామె: 2032)

10. నిద్ర లేచిన తరువాత "లా ఇలాహ ఇల్లల్లాహు వహదహూ లాషరీకలహూ లహుల్ ముల్క్ మలహుల్ హందు వ హువ అలా కుల్లి షైఇన్ కరీద్ అల్ హందులిల్లాహ్ వ సుబ్హానల్లాహ్ వ లా ఇలాహ ఇల్లల్లాహు వల్లాహు అక్బర్ వలా హౌల వలా కువ్వత ఇల్లా బిల్లాహ్" చదివిన తరువాత. (బుఖారీ: 1154) మొదలగునవి.

3. ఒక స్త్రీ నరకంలో ప్రవేశిస్తే ఆమెతోపాటు నలుగురు పురుషులని (తండ్రి, భర్త, అన, కొడుకు) నరకంలోకి తీసుకెళుతుందని విన్నాము. ఇది ఏ హదీసులో ఉంది?

జ: ఇదే ప్రశ్న పెద్ద పెద్ద పండితులను కూడా అడగటం జరిగింది. వారందరూ ఇలాంటి హదీసు ఏమీ లేదు అని ముక్తకంఠంగా చెప్పారు. అంతే కాక ఇది ఇస్లామీయ సూత్రాలకు కూడా విరుద్ధమని పేర్కొన్నారు.

4. ఇస్లాం లో ఎలాంటి వస్త్రాలు ధరించమని ఆదేశించబడింది? సూటు వేసుకోవడం ఇస్లాంలో నిషేధమా?

జ: ఖుర్ఆన్ మరియు హదీసుల అధ్యాయనం ద్వారా మనకు తెలిసేదేమిటంటే ఇస్లాం వస్త్రధారణకు సంబంధించి 5 షరతులు విధిస్తుంది. ఆ 5 షరతులకు అనుగుణంగా ఉన్న ఏ వస్త్రాన్నయినా ధరించవచ్చు.

1. అవి నిషేధించబడినవి కాకూడదు:

పురుషులకు పట్టు వస్త్రాలు ధరించడం నిషేధించబడినది. అలాగే జీ రూహ్ (ప్రాణము గల జీవుల) బొమ్మలు ఉన్న వస్త్రాలు ధరించడం స్త్రీ, పురుషులిద్దరి కొరకు నిషేధించబడింది. ఇలాంటి వస్త్రాలు ధరించరాదు.

2. అవి కుఫ్ఫార్ ధరించే వస్త్రాలు కాకూడదు:

